

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. 8లో



.. వెలుగులు నింపే రాత్రి

ముస్లింలు పవిత్రంగా భావించే రాత్రులలో ఒకటైన షబ్ ఏ బరాత్‌ను గురువారం జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 36° / 18°

జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రత అత్యధికంగా నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకుడు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం వైభవంగా చండీహోమం చేశారు. ముందుగా మేళతాళాలు, వేద మంత్రాలతో స్వామివారి ఉత్సవమూర్తులను అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం మండపారాధన, గణపతి పూజ చేసి, హోమం, చివరకు పూర్ణాహుతి నిర్వహించారు. చండీహోమంలో పాల్గొన్న 15 మంది భక్త దంపతులకు అర్చకులు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

పడిపోతున్న తాలిపేరు నీటిమట్టం

మార్చి 31 వరకు ఆరుతడి పంటలకే సాగునీరు

చర్ల: తాలిపేరు ప్రాజెక్ట్‌లోకి ఇన్ ఫ్లో తగ్గుతుండగా నీటిమట్టం గణనీయంగా పడిపోతోందని, రబీలో ఆరుపడి పంటలకు, అది కూడా మార్చి 31 వరకు మాత్రమే సాగునీరు అందిస్తామని ఈఈ రాంప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరుతండి పంటలు సాగు చేసిన రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 73.72 మీటర్లు మాత్రమే నిల్వ ఉందని, వారబందీ పద్ధతిన నీరు విడుదల చేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు ఏర్పాటు

అశ్వారావుపేటరూరల్: బ్రాయిలర్ కోళ్లకు వైరస్ సోకుతున్నందున ఇతర ప్రాంతాల నుంచి కోళ్ల రవాణా, దిగుమతిని అడ్డుకునేందుకు రాష్ట్ర సరిహద్దులో స్థానిక పశు సంవర్ధక, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో చెక్ పోస్టును ఏర్పాటుచేశారు. తెలంగాణ – ఏపీ సరిహద్దులో అశ్వారావుపేట సమీపంలో గల ఆర్టీఏ చెక్ పోస్టు వద్ద తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కోళ్లను తీసుకు రాకుండా తనిఖీ చేస్తున్నారు. మంగళవారం అర్ధ రాత్రి నుంచే తనిఖీలు చేపట్టగా అటు నుంచి వచ్చే కోళ్లను అడ్డుకుని వెనక్కు పంపిస్తున్నారు. మరో వైపు కోళ్లకు వైరస్ కారణంగా వినియోగదారులు లేక చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి. అయినా అశ్వారావుపేటలో కేజీ చికెన్ ధర రూ.220కి తగ్గకపోవడం గమనార్హం.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డీడబ్ల్యూఓ లెనినా

అశ్వారావుపేటరూరల్: పట్టణ పరిధిలోని కొత్త పేరాయిగూడెం, నెహ్రూనగర్ అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం డీడబ్ల్యూఓ లెనినా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా కేంద్రాల్లో చిన్నారుల హాజరు, లబ్ధిదారుల రికార్డులతోపాటు పోషకాహారం, బాలామృతం స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులు, బాలింతలతో మాట్లాడి.. పోషకాహారం, కోడిగుడ్లు సకాలంలో అందిస్తున్నారా? అంటూ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీడీపీఓ ముత్తమ్మ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.

బాజా మోత.. ప్రైవేటు వాత!



కొత్తగూడెంలో నిరుపయోగంగా ఉన్న టీటీడీ కల్యాణ మండపం

సర్కారు మండపాల్లో బాజాలు మోగేదెప్పుడో..?

- మాఘ మాసంలో జోరుగా కల్యాణాలు
- ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు ఫుల్ డిమాండ్
- అందుబాటులోకి రాని ప్రభుత్వ కల్యాణ మండపాలు
- నిధుల కొరత, నిర్లక్ష్యంతో ముందుకు సాగని పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మాఘమాసం కావడంతో గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుగుతున్నాయి. వేసవికాలం ముగిసే వరకు ఈ తరహా పరిస్థితి నెలకొని ఉండనుంది. అయితే పెళ్లి తంతు నిర్వహించడం పట్టణాల్లో ఖరీదైన వ్యవహారంగా మారుతోంది. శుభకార్యాలు చేయాలంటే సామాన్యులకు తలకు మించిన భారం అవుతోంది. ఒకేసారి ఎక్కువ కార్యక్రమాలు ఉండడంతో ఫంక్షన్ హాళ్లకు డిమాండ్ పెరుగుతోంది. రూ.15 వేలు అద్దె ఉండే హాళ్లకు రూ.50 వేల వరకు చెల్లించాల్సి వస్తోంది. అది కూడా అడిగిన వెంటనే అడ్వాన్స్ ఇస్తేనే. లేదంటే రేట్ మరింతగా పెరుగుతుంది. మరోవైపు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాళ్లు ఏళ్లు గడిచినా అందుబాటులోకి రావడం లేదు.

టీటీడీ.. మూతబడి..

కొత్తగూడెంలో ఎన్నో శుభ కార్యాలకు ఏళ్ల తరబడి వేదికగా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానం వారి కల్యాణ మండపం గత కొన్నేళ్లుగా మూతబడి ఉంది. మరమ్మతులు చేయాలంటూ ఈ మండపాన్ని అద్దెకు ఇవ్వడం లేదు. అలా అని మరమ్మతులూ చేపట్టడం లేదు. దీనికి సమీపంలోనే అంబేద్కర్ భవన్, షాదీఖానాలున్నా అవీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ఇప్పటికీ జిల్లా కేంద్రంలో ఫంక్షన్లు చేయాలంటే ప్రైవేటు హాళ్లు, వివిధ క్లబ్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేదికలే ఆధారం. దశాబ్దాలుగా సేవలందిస్తున్న సింగరేణి క్లబ్‌లు సైతం ప్రస్తుత అవసరాలు తీర్చలేకపోతున్నాయి. దీంతో త్రిమాతా ఆలయం సమీపంలో సింగరేణి కొత్త ఫంక్షన్ హాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టినా చివరి దశలో పనుల్లో వేగం మందగించింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన హరిత కన్వెన్షన్ పనులు సైతం మందకొడిగానే సాగుతున్నాయి. దీంతో కొత్తగూడెం, పాల్వంచ పట్టణాల ప్రజలు శుభకార్యాల కోసం పెద్దమ్మ గుడి దగ్గరున్న ఫంక్షన్ హాళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇటీవల దేవాదాయశాఖ వారు ఇక్కడ రెండు హాళ్లను అందుబాటులోకి తేవడంతో చుక్కలనంటే ప్రైవేట్ ఫంక్షన్ హాళ్ల ధరలకు కొంత మేర కళ్లెం పడింది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో..

భద్రాచలం పట్టణంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మక్క ఫంక్షన్ హాల్ మినహా మరొకటి అందుబాటులో లేదు. ఇటు ప్రభుత్వ, అటు ప్రైవేట్ పరంగా ఏ కార్యక్రమం నిర్వహించాలన్నా ప్రైవేటు హాళ్లపైనే ఆధారపడాల్సి వస్తోంది. వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో ఉన్న భవనాలు, సత్రాలే ప్రజల అవసరాలను కొంతమేర తీరుస్తున్నాయి. చివరకు రాష్ట్రపతి, ముఖ్యమంత్రి, మరెవరైనా ఇక్కడి ప్రజలతో మాటామంతీ చేయాలన్నా ప్రైవేట్ హాళ్లలోనే నిర్వహించాల్సి వస్తోంది. ఇక్కడ ఫంక్షన్ హాళ్లకు ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రైవేట్ సెక్టార్‌లో పట్టణ శివారులో ఉన్న ఏపీలోని యెటపాకలో కొత్తవి వెలుస్తున్నాయి. సమీపంలోని సారపాక ప్రజల అవసరాలకు ఐటీసీ సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన ఫంక్షన్ హాళ్లు ఉపయోగపడుతున్నాయి.

పారిశ్రామిక ప్రాంతంలో..

ఇల్లెందులో నాలుగేళ్లుగా వివిధ ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులు జరుగుతూనే ఉన్నాయి. గిరిజన భవన్ నిర్మాణం పూర్తయినా కేవలం నీళ్లు, విద్యుత్ కనెక్షన్ లేక ఏళ్ల తరబడి నిరుపయోగంగా ఉంది. నెల రోజుల్లో ఈ ఫంక్షన్ హాల్‌ను అందుబాటులోకి తేవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గత ఆగస్టులో ఆదేశాలు జారీ చేసినా అమలుకు నోచుకోలేదు. బంజారా భవన్, అంబేద్కర్ భవన్, మల్టీ యుటిలిటీ సెంటర్ వంటి నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రైవేటు ఫంక్షన్ హాళ్లు, సింగరేణి ఆధ్వర్యంలోని కల్యాణ వేదికలే ఈ పట్టణానికి ప్రధాన దిక్కుగా ఉన్నాయి. మణుగూరు, అశ్వారావుపేటల్లోనూ ఇదే రకమైన పరిస్థితి ఉంది.



ఇల్లెందులో విద్యుత్, తాగునీరు లేక మూతబడిన గిరిజన భవన్

రామయ్యకు సహస్ర కలశాభిషేకం



స్వామివారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

- మాఘ పౌర్ణమి వేళ ప్రత్యేక పూజలు
- కమనీయంగా రంగనాథస్వామి కల్యాణం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో మాఘమాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం సహస్ర కలశాభిషేకోత్సవాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. దేవతలను ఆవాహనం చేసిన కలశాలలో శుద్ధ జలాన్ని నింపి బేడా మండపంలో ఏర్పాటు చేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ తర్వాత కలశాల్లోని పంచామృత జలాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన శ్రీ సీతాలక్ష్మణ సమేత రామచంద్ర స్వామికి ఆవాహనం చేసిన కలశాల్లోని జలాలతో నేత్రపర్వంగా అభిషేకం చేశారు. నక్షత్ర హారతి సమర్పించారు. సహస్ర కలశాభిషేక ఉత్సవాల ముగింపు సందర్భంగా యాగశాలలో పూర్ణాహుతి జరిపారు. దేవస్థానంలో తెలిసీ తెలియక జరిగిన తప్పొప్పుల నుంచి ప్రాయశ్చిత్తం కలిగేందుకు మాఘ పౌర్ణమి రోజున స్వామి వారికి సహస్ర కలశాభిషేకం చేయడం ఆనవాయితీ అని వేదపండితులు వివరించారు. ఈ సందర్భంగా స్వామికి పవళింపు సేవ రద్దు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథస్వామి కల్యాణం..

రామాలయానికి అనుబంధంగా ఉన్న రంగనాయకుల గుట్టపై వేంచేసి ఉన్న శ్రీ రంగనాథ స్వామి కల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం తరఫున ఈఓ రమాదేవి స్వామివారికి పట్టువస్త్రాలు, కల్యాణ సామగ్రి అందజేశారు. అర్చకులు విశ్వక్సేనపూజ, పుణ్యావాచనం చేశాక స్వామి వారికి కంకణధారణ, అమ్మవారికి మాంగల్యధారణ, తలంబ్రాల కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, సహస్ర కలశాభిషేకోత్సవం సందర్భంగా రామాలయంలో రెండు రోజుల పాటు రద్దయిన నిత్యకల్యాణ వేడుకలు తిరిగి గురువారం పునఃప్రారంభం అవుతాయని అధికారులు తెలిపారు.

ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభం..

ఎండలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఆలయ ఈఓ రమాదేవి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని భక్తులకు మజ్జిగ అందజేస్తున్నట్లు తెలిపారు.

నిలిచిన సీసీఐ కొనుగోళ్లు

సర్వర్‌లో సాంకేతిక సమస్యలే కారణం



నెల్లిపాక బంజర మిల్లు వద్ద నిలిచిన వాహనాలు

బూర్గంపాడు: జిల్లాలో మంగళవారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ విషయం తెలియక పత్తి వాహనాలతో మంగళ, బుధవారాల్లో జిన్నింగ్ మిల్లుల వద్దకు వచ్చిన రైతులు పడిగాపులు కాస్తున్నారు. దేశవ్యాప్తంగా సీసీఐ సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు పూర్తిగా సీసీఐ కేంద్రాలపైనే ఆధారపడ్డారు. ఈ మేరకు జిల్లాలో నవంబర్‌లో నాలుగు కేంద్రాలు ఏర్పాటుచేయగా మూడు నెలల పాటు పత్తి కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగాయి. ఇప్పుడు రైతుల వద్ద పత్తి చివరి దశకు చేరగా, నల్లరేగడి, సాగునీటి వసతులు ఉన్న భూముల్లో పత్తి వస్తుండడంతో కొందరు రైతులు తీసుకొస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోలు చేస్తే రైతులకు మద్దతు ధర లభించనుంది. ఇంతలోనే సాంకేతిక సమస్యలతో రెండు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోగా, మళ్లీ ఎప్పుడు మొదలవుతుందో తెలియక రైతులు ఎదురుచూస్తున్నారు. ఒకటి, రెండు రోజుల్లో కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోతాయని కొందరు బయ్యర్లు రైతులకు చూచాయగా చెప్పినట్లు సమాచారం. అయితే, కనీసం వారం పాటు పత్తి కొనుగోళ్లు జరపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా మార్కెటింగ్ అధికారులను సంప్రదించగా సాంకేతిక కారణాలతోనే సీసీఐ కొనుగోళ్లు నిలిచాయని, సర్వర్లు అందుబాటులోకి రాగానే కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

‘అడ్రియాల’కు కలిసొచ్చిన డైరెక్టర్ పోస్టులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్ట్ (ఏఎల్‌పీ) డివిజన్‌లో జీఎంలుగా పనిచేసిన వారిని డైరెక్టర్ పోస్టులు వరిస్తున్నాయి. వరుసగా ఇప్పటివరకు ఐదుగురు జీఎంలు డైరెక్టర్లుగా ఎంపిక కాగా, వారిలో ఒకరు కోలిండియాకు కూడా ఎంపికయ్యారు. ప్రస్తుత జీఎం వెంకటేశ్వర్లు ఈనెల 10న జరిగిన ఇంటర్వ్యూలో ఆపరేషన్స్ డైరెక్టర్‌గా ఎంపికై, హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అదేరోజు బాధ్యతలు చేపట్టారు. 2010 – 15 మధ్యన ఇక్కడ పనిచేసిన జీఎం బాస్కర్‌రావు, 2015– 17లో పనిచేసిన చంద్రశేఖర్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా, 2017 – 19లో పనిచేసిన వీరారెడ్డి కోలిండియాలో టెక్నికల్ డైరెక్టర్‌గా, సింగరేణిలో డైరెక్టర్ పీపీగా ఎంపికయ్యారు. 2019 – 20లో జీఎంగా విధులు నిర్వహించిన ఎన్‌వీకే శ్రీనివాస్ కూడా డైరెక్టర్ (ఆపరేషన్స్)గా ఎంపికయ్యారు. ఇలా ఇక్కడ పనిచేసిన ఐదుగురు జీఎంలు డైరెక్టర్లుగా ఎంపిక అయినప్పటికీ.. అక్కడ పనిచేసేందుకు కార్మికులు, ఉద్యోగులు మాత్రం సుముఖత వ్యక్తం చేయడం లేదు. ఇటీవల బదిలీ వర్కర్లు కూడా అక్కడ పోస్టింగ్ తీసుకోకుండా సుమారు మూడు నెలలు ఖాళీగా ఉండి ఆ తర్వాత ఓ మంత్రితో సిఫార్సుతో వేరే గనికి బదిలీ చేయించుకోవడం గమనార్హం.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్

చుంచుపల్లి: త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించాలని, ఈ మేరకు సిబ్బంది సన్నద్ధం కావాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలకు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల నియమావళి అమలుతో పాటు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటర్లకు ఏమైనా సందేహాలు వస్తే వెంటనే నివృత్తి చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని చెప్పారు. పోలింగ్ నిర్వహణపై సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్, డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

నేడు పంచాయతీ ఎన్నికలపై..

గ్రామపంచాయతీ ఎన్నికలకు హాజరయ్యే పోలింగ్ సిబ్బందికి గురువారం కొత్తగూడెంలోని ఆనందఖని పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు డీపీఓ చంద్రమౌళి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, ఎంఓటీలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

సర్కారు స్కూళ్లలో ఎల్‌కేజీ ప్రవేశపెట్టాలి

- పిల్లలకు మూడేళ్లకే అవకాశం కల్పించాలి
- ఇబ్బందులు లేని జోనల్ విధానం కావాలి
- టీపీయూఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సరోత్తం రెడ్డి



మాట్లాడుతున్న సరోత్తంరెడ్డి, పక్కన రంగాకిరణ్ తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ పాఠశాలల్లో మూడో ఏడాది నుంచే పిల్లలకు ప్రవేశాలు కల్పించాలని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన టీపీయూఎస్ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డి డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం ఆయన బీజేపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఐదో తరగతి నుంచి ప్రవేశాలు ఉండడంతో విద్యార్థులంతా ప్రైవేటు బడులకు వెళ్తున్నారని, ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పడిపోతోందని అన్నారు. దీన్ని నివారించేందుకు ఎల్‌కేజీ ప్రవేశపెట్టాలన్నారు. 2023 జూలైతోనే పీఆర్‌సీ గడువు ముగిసినా ఇంతవరకూ కొత్త పీఆర్‌సీ రాలేదన్నారు. కమిషన్‌తో కాలయాపన తప్ప ఫలితాలు లేవన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జోనల్ విధానంతో ఉపాధ్యాయులకు తీరని నష్టం వాటిల్లుతోందని ఆరోపించారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే ఉపాధ్యాయులకు లబ్ధి చేకూరేలా కొత్త జోనల్ విధానం అమల్లోకి తెచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ జీవిత బీమా, జీపీఎఫ్ డబ్బులు దుర్వినియోగం కాకుండా చూస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు మంజూరయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని అన్నారు. విద్యార్థుల ఆవాసాలకు దగ్గరలోనే పాఠశాల ఉండాలనే విద్యాహక్కు చట్టం అమలు కావడం లేదని, దాన్ని అమలు చేయించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. మోడల్ స్కూళ్లను ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్వశిక్ష అభియాన్ కింద పని చేస్తున్నవారికి కనీస వేతన స్కేల్ అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో వర్క్‌లోడుకు తగ్గట్టుగా సపోర్టింగ్ సిబ్బందిని నియమించాలన్నారు. ప్రస్తుతం అన్ని పనులూ ఉపాధ్యాయులే చేస్తుండడంతో బోధనపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కుంచె రంగాకిరణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓటును టీపీయూఎస్ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో 2,054 మంది ఓటర్లు ఉన్నారని, వారి విధులకు ఆటంకం కలగకుండా ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. సరోత్తంరెడ్డి గెలుపును కాంక్షిస్తూ త్వరలోనే రాష్ట్ర నేతలు జిల్లాలో పర్యటిస్తారని ఆయన వెల్లడించారు.

క్లుప్తంగా

మినీ మేడారం జాతరకు బస్సులేవి?

● అసహనం వ్యక్తం చేస్తున్న భక్తులు

చుంచుపల్లి: ములుగు జిల్లా మేడారంలో రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క – సారలమ్మ మహాజాతరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీ ఎత్తున భక్తులు తరలివెళ్తుంటారు. కాగా, బుధవారం నుంచి మొదలైన మినీ మేడారం జాతరకు సైతం భక్తులు వెళ్తుండగా ఆర్టీసీ అధికారులు బస్సులు కేటాయించలేదు. దీంతో భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మినీ మేడారం జాతరను దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు డిపోకు కనీసం ఒకటి, రెండు సర్వీసులనైనా కేటాయించకపోవడంతో బస్టాండ్లకు వస్తున్న పలువురు నిరాశతో వెనుదిరుగుతున్నారు. ప్రధానంగా కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట ప్రాంతాల నుంచి ఈ నాలుగు రోజులు మినీ మేడారం జాతరకు భక్తులు అధిక సంఖ్యలోనే వెళ్తారు. బస్సులు అందుబాటులో లేకపోవటంతో ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెం గ్రామానికి చెందిన నేలాల కిషందరావు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసి కాపర్ వైరు చోరీ చేశారు. బుధవారం ఉదయం రైతు కిషందరావు పొలానికి వెళ్లగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి ఉండటాన్ని గమనించి, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి ఏఈ సతీశ్ చేరుకొని పరిశీలించారు. ఈ ఘటనపై రైతు ఫిర్యాదు పోలీసులకు చేశారని ఏఈ చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఇసుక ట్రాక్టర్లతో అటవీశాఖ సిబ్బంది

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం అటవీ రేంజ్ పరిధిలో బుధవారం తెల్లవారుజామున ఎఫ్ఆర్‌వో ఉదయ్, బీట్ సిబ్బంది రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. అటవీ ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్లను ఇల్లెందులోని కలప యార్డుకు తరలించారు. తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌వో తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

చర్ల: మండలంలోని గోగుబాకలో ప్రధాన రహదారిపై లారీ ఢీకొని ఓవ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. దుమ్ముగూడెం మండలంలోని జడ్.వీరభద్రవరం, కమలాపురం గ్రామాలకు చెందిన పలువురు సత్యనారాయణపురంలోని బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. జడ్.వీరభద్రవరానికి చెందిన కొమరం రాంబాబు (35), కుంజా మహేశ్ ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్తుండగా గోగుబాక మూలమలుపు వద్ద భద్రాచలం వైపు నుంచి చర్ల వైపునకు ఇసుక లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. వెనుక కూర్చున్న కొమరం రాంబాబు లారీ వెనుక చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. మహేశ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. మృతుడికి భార్య సమ్మక్క ఉంది. చర్ల సీఐ రాజువర్మ, ఎస్‌ఐలు నర్సిరెడ్డి, కేశవ్ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు. లారీడ్రైవర్ పరారయ్యాడు. మృతుడి భార్య సమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నపమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

జాబ్‌మేళాలో ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా గిరిజన యువత, నిరుద్యోగులు అందివచ్చే ప్రతీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ వృత్తి నైపుణ్యాలు మెరుగుపర్చుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ ప్రాంగణం వైటీసీలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరైన యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానుగణంగా వృత్తి నైపుణ్యాలు పెంచుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రయత్నాలు కొనసాగిస్తూనే స్వయం ఉపాధి రంగాలపై దృష్టి సారించాలని సూచించారు. ఐటీడీఏ భవిత విభాగం ద్వారా ఇచ్చే శిక్షణను ఉపయోగించుకోవాలని తెలిపారు. కాగా, జాబ్‌మేళాకు హాజరైన 80 మందిలో 39 మంది ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలను సాధించారని పీఓ వెల్లడించారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న పీఓ రాహుల్

ఆహ్లాదకరంగా మ్యూజియం ఆవరణ

ఐటీడీఏలోని గిరిజన మ్యూజియానికి వచ్చే పర్యాటకులు, భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా తీర్చిదిద్దాలని పీఓ రాహుల్ సూచించారు. కమిటీ సభ్యులతో కలిసి మ్యూజియంను పరిశీలించిన ఆయన రకరకాల పూలు, కళాకృతులను పరిశీలించి మాట్లాడారు. సెల్ఫీ పాయింట్, మంచె, గుడిసెల వద్ద కళాకారులను అమర్చాలని, మంచెపైనా వెదురు డైనింగ్ సెట్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమాల్లో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, జేడీఎం హరికృష్ణ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ చంద్రశేఖర్, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, డీఈ హరీశ్, టీఏ శ్రీనివాస్, మ్యూజియం ఇన్‌చార్జ్ వీరస్వామి, క్రాఫ్ట్ టీచర్లు సరస్వతి, సునంద పాల్గొన్నారు.

విశ్వాసంలో వెలుగులు నింపే రాత్రి..!

- షాబాన్ నెలలో మహోన్నత రోజు
- ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షల్లో ముస్లింలు
- నేడు షబ్ ఏ బరాత్

కరకగూడెం : షబ్ ఏ బరాత్ ఇస్లాంలోని అత్యంత పవిత్రమైన రాత్రుల్లో ఒకటి. దీన్నే 'క్షమాపణ రాత్రి' అని కూడా అంటారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం షాబాన్ నెలలో వస్తుంది. ఈ రాత్రి ముస్లింలు తమ పాపాలకు క్షమాపణతో పాటు అల్లా నుంచి మోక్షం కోరుకుంటారు. ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేస్తారు. ఈ పండుగను గురువారం జరుపుకోనున్నారు.

షబ్ ఏ బరాత్ ప్రాముఖ్యత..

షబ్ ఏ బరాత్ అనే పదం పర్షియన్ మూలాన్ని కలిగి ఉంటుంది. షబ్ అంటే రాత్రి.. బరాత్ అనేది మోక్షం, క్షమాపణను సూచించే అరబిక్ పదం. అనారోగ్యంతో ఉన్న కుటుంబసభ్యుల కోసం దయను వెదకడానికి కూడా ఈ రాత్రి ఉపయోగపడుతుందని ముస్లింల నమ్మకం. రాబోయే రోజుల్లో తమ అదృష్టాన్ని, జీవనోపాధిని అల్లాహ్ నిర్ణయిస్తాడని విశ్వాసం.



ప్రత్యేక సంప్రదాయాలు..

షబ్ ఏ బరాత్ ఎన్నో ప్రత్యేక సంప్రదాయాలను కలిగి ఉంది. ఈ రోజున ముస్లింలు తమ పొరుగు వారికి, బంధువులు, కుటుంబ సభ్యులకు, పేదలకు రుచికరమైన హల్వా, జర్దా, ఇతర వంటకాలను పంచుతారు. చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ సమాధులను సందర్శిస్తారు. ఈ రాత్రికి ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేస్తారు. దివ్య ఖురాన్ పారాయణం చేసి, నఫిల్ నమాజ్ చదువుతారు.

ఆధ్యాత్మిక పునర్జన్మకు తొలి అడుగు..



ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం షాబాన్ నెలలోని 15వ రాత్రిని షబ్ ఏ బరాత్ అంటారు. ఈ రాత్రిని ముస్లింలు అత్యంత పవిత్రమైనదిగా భావిస్తారు. ఈ రాత్రి అల్లాహ్ తన ప్రియమైన వారితో లెక్కలు తేల్చడానికి వస్తాడని నమ్ముతారు. అంతేకాక ఆధ్యాత్మిక పునర్జన్మకు తొలి అడుగుగా భావిస్తారు.

– మౌలానా మొహమ్మద్ ఫిరోజ్, కరకగూడెం

నూతన ఆరంభానికి నాంది..



ఈ రోజు ముస్లింలకు సర్వ శుభాల రాత్రి. ఖురాన్ ప్రకారం అల్లాను క్షమాపణ కోరుకునేవారిని ఆయన మన్నించి సన్మార్గంలో నడిపిస్తాడు. ఈ రాత్రి నూతన ఆరంభానికి నాంది పలుకుతుంది. ప్రార్థనలతో అల్లాహ్‌కు దగ్గరవ్వడానికి అద్భుత అవకాశం.

–మౌలానా మొహమ్మద్ అజం, పద్మాపురం

వ్యర్థాలా.. మృతి చెందిన కోళ్లా?

చేపల చెరువుల్లో వేస్తుండడంపై అనుమానాలు

పాల్వంచరూరల్: ఓ పక్క కోళ్లకు వైరస్ సోకుతుందన్న ప్రచారంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. కానీ, ఇదేమీ పట్టించుకోకుండా చేపల పెంపకందారులు మాత్రం కోళ్ల వ్యర్థాలను తీసుకొచ్చి చెరువుల్లో చేపలకు ఆహారంగా వేస్తున్నారు. అయితే, ఇవి కోళ్ల వ్యర్థాలా, వైరస్‌తో చనిపోయిన కోళ్ల కళేబరాలా అన్నది తెలియరావడం లేదు. ఈ విషయంలో నిఘా వేయాల్సిన మత్స్యశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పాల్వంచ మండలం కిన్నెరసాని, రాజాపురం, పాండురంగాపురం, రెడ్డిగూడెం, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లోని నీటికుంటల్లో చేపలను పెంచుతున్నారు. ఏపీకి చెందిన కొందరు వ్యాపారులు చెరువులను లీజ్‌కు తీసుకుని చేపలు పెంచుతుండగా, వీటికి దాణా బదులు కోళ్ల వ్యర్థాలను వేస్తుండడం గమనార్హం. ఇన్నాళ్లు పాల్వంచ, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లోని చికెన్ సెంటర్ల నుంచి కోళ్ల వ్యర్థాలను తెచ్చి వేస్తున్నారని భావించారు. అయితే, మంగళవారం రాజాపురం వద్ద చెరువులో ట్రాలీ ఆటో నిండా తెచ్చి వేసినవి వ్యర్థాలా, వైరస్ ప్రభావంతో చనిపోయిన కోళ్లా అన్నది స్పష్టత రావడం లేదు. మరోపక్క వ్యర్థాలను చెరువుల్లో వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, చేపల చెరువుల నిర్వహణపై మత్స్యశాఖ అధికారి పర్యవేక్షణ లోపం, రెవెన్యూ, పశు వైద్యశాఖ అధికారుల పట్టింపులేని తనంతోనే ఇలా జరుగుతోందని ఆరోపిస్తున్నారు. కాగా, ఈ విషయమై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ అహ్మద్‌ఖాన్ వివరణ కోసం ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



రాజాపురం చేపల చెరువులో వేసిన కోళ్ల వ్యర్థాలు

చెక్ బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

ఇల్లెందు: చెక్ బౌన్స్ కేసులో ఓ వ్యక్తికి ఇల్లెందు కోర్టు న్యాయమూర్తి దేవరపల్లి కీర్తిచంద్రికరెడ్డి బుధవారం ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఇల్లెందుకు చెందిన పడాల వెంకటకృష్ణారావు బల్లెం ప్రభాకర్‌కు రూ.150 లక్షలు కుటుంబ అవసరాల నిమిత్తం ఇచ్చారు. పలుమార్లు నగదు చెల్లించాలని కోరగా.. ప్రభాకర్ రూ.2 లక్షలకు చెక్కు ఇవ్వడంతో అది బౌన్స్ అయింది. దీంతో వెంకటకృష్ణారావు తన న్యాయవాది అనిల్‌కుమార్ ద్వారా కోర్టులో కేసు వేయగా విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. సాక్ష్యాధారాలను పరిశీలించి ప్రభాకర్‌కు ఆరు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. రూ.2 లక్షలు పరిహారం ఇవ్వాలని కూడా తీర్పులో పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాలిక సత్తుపల్లిలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. రోజూ మాదిరిగానే మంగళవారం కళాశాలకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. తల్లితండ్రులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

22, 23వ తేదీల్లో అథ్లెటిక్స్ పోటీలు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 22, 23 తేదీల్లో కోలిండియాస్థాయి అథ్లెటిక్స్ (మహిళ, పురుషుల) పోటీలను ఘనంగా నిర్వహించాలని జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) పేర్కొన్నారు. బుధవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్లో వివిధ విభాగాల అధికారులతో సమీక్షించారు. 2024–25 ఏడాదికి సంబంధించి కోలిండియాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు సింగరేణి కార్పొరేట్ ఏరియా నిర్వహిస్తుందని, ఈ పోటీలకు కోలిండియా పరిధిలోని మొత్తం 10 బొగ్గు పరిశ్రమల జట్లు తలపడనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జీఎం (ఈఅండ్ఎం) దామోదర్‌రావు, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, రాజశేఖర్, నాగరాజు, వేణుమాధవ్, రామశేషయ్య, డేవిడ్, అభిలాష్, ముకుంద, సత్యనారాయణ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జీఎం పర్సనల్

అప్పు తీసుకుని తిరిగి ఇవ్వని వ్యాపారులు

● ఆందోళన చేపట్టిన బాధితులు

మణుగూరుటౌన్: నమ్మి లక్షలకు లక్షలు డబ్బులు వడ్డీకి ఇచ్చారు.. తర్వాత అసలు, వడ్డీ కావాలంటూ ఒత్తిడి చేయడంతో పదేళ్ల తర్వాత చెల్లిస్తామంటూ రుణగ్రహీతలు నోటీసులు పంపారు. దీంతో బాధితులు ఆందోళన బాట పట్టారు. ఈ ఘటన బుధవారం మణుగూరులో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పట్టణంలోని అన్నారం గ్రామానికి చెందిన సోదరులు రామ్, లక్ష్మణ్ పూలమార్కెట్ ఏరియాలో లక్ష్మీశ్రీనివాస కిరాణా జనరల్ స్టోర్స్ పేరిట వ్యాపారం నిర్వహించారు. పలువురు వ్యక్తులు, వ్యాపారుల నుంచి రూ.రెండు కోట్ల వరకు రుణాలు తీసుకుని కొద్ది కాలం వడ్డీ చెల్లించారు. వ్యాపారం నడవడం లేదంటూ మరోచోటికి మార్చారు. ఈ క్రమంలో వడ్డీ చెల్లించకుండా తీసుకున్న అసలు డబ్బుపై మాట దాటవేస్తుండటంతో బాధితుల నుంచి ఒత్తిడి అధికమైంది. ఈ నేపథ్యంలో పదేళ్ల తర్వాత అసలు డబ్బులు చెల్లిస్తామని, అప్పటివరకు తమను అడగవద్దని కొందరికి నోటీసులు పంపారు. విషయం తెలిసిన బాధితులు దుకాణానికి తాళం వేసి, వ్యాపారి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. సీఐ సోమ సతీశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.



ఆందోళన చేస్తున్న డబ్బులిచ్చిన బాధితులు

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మణుగూరుటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన మణుగూరులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. రామానుజవరం గ్రామానికి చెందిన నడికొప్పుల సంపత్(19) కూలీ పనులకు వెళ్తూ జీవనం సాగిస్తున్నాడు. తన స్నేహితుడు సాయి (బైక్ మెకానిక్ నేర్చుకుంటున్నారు)తో మణుగూరు నుంచి మంగళవారం రాత్రి రామానుజవరం వెళ్తున్నారు. సురక్షాబస్టాండ్ సమీపంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి లారీకే తగిలి టైర్ కిందపడి తీవ్ర గాయాలపాయ్యారు. వెంటనే క్షతగాత్రులను స్థానికులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం ఉదయం సంపత్ మృతి చెందాడు. సాయి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, రామానుజవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



సంపత్ (ఫైల్)

అశ్వాపురం మండలంలో..

అశ్వాపురం: మండలంలోని మల్లెలమడుగు శివారులో గత నెల 31న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు భద్రాచలం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మండలంలోని చింతిర్యాల గూడెం గ్రామానికి చెందిన సోలం హర్షవర్ధన్ (22) డెకరేషన్ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. బైక్‌పై వెళ్తూ చెట్టుకు ఢీకొని కోమాలోకి వెళ్లాడు. దాతలు, స్థానికులు వైద్యానికి ఆర్థిక సాయం చేశారు. వైద్యులు ఆపరేషన్ కూడా చేశారు. అయినప్పటికీ ఆరోగ్యం క్షీణించి హర్షవర్ధన్ మృతి చెందాడు. మృతుడి తండ్రి తిరుపతిరావు మూగవాడ కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



హర్షవర్ధన్ (ఫైల్)

పోలీసుల అదుపులో రంగరాజన్‌పై దాడి చేసిన వ్యక్తులు

భద్రాచలంఅర్బన్: ఇటీవల హైదరాబాద్‌లోని చిలుకూరి బాలాజీ దేవాలయం అర్చకులు రంగరాజన్‌పై దాడికి పాల్పడిన 25 మందిలో ఇద్దరిని సైబరాబాద్ పోలీసులు బుధవారం భద్రాచలంలో అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా వీఆర్ పురానికి చెందిన ఇద్దరు భద్రాచలంలో ఉన్నారనే సమాచారం తెలుసుకున్న పోలీసులు వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే వారి పేర్లు, వివరాలు ఇంకా తెలియరాలేదు.

దాడి చేశారని ఆర్మీ జవాన్ ఫిర్యాదు

చింతకాని: కేసు విచారణ నిమిత్తం చింతకాని పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన తనపై పలువురు స్టేషన్ ఆవరణలోనే దాడి చేశారని బోనకల్ మండలం గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బూదాల మనోజ్ తెలిపారు. నాగులవంచలోని పెట్రోల్ బంక్‌లో ఐదు రోజుల క్రితం జరిగిన ఘర్షణ కేసు విచారణకు బుధవారం తాను ఎస్సై వద్దకు వెళ్తుండగా అక్కడే ఉన్న ఉమ్మనేని రమేశ్, లగడపాటి సాయి దాడి చేశారని వెల్లడించాడు. ఈమేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు. ఈవిషయమై ఎస్సై నాగుల్‌మీరా మాట్లాడుతూ విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

దంపతుల ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాల కారణంగా దంపతులు పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బంద్రుగొండలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బంద్రుగొండ గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న దంపతులు అంబటి ప్రసన్నకుమార్, సంధ్య కుటుంబ కలహాల కారణంగా బుధవారం ఇంటి వద్ద పురుగులమందు తాగారు. స్థానికులు గమనించి ఇద్దరినీ పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థి మృతికి కారణమైన వ్యక్తికి జైలుశిక్ష

ఖమ్మం లీగల్: అజాగ్రత్తగా ట్రాక్టర్ నడిపి విద్యార్థి మృతికి కారణమైన ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌కు చెందిన డ్రైవర్ చెరుకూరి వెంకటేశ్వర్లుకు ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తూ ఖమ్మం రెండో అదనపు ప్రథమ శ్రేణి మెజిస్ట్రేట్ ఏపూరి బిందుప్రియ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు... 2017 అక్టోబర్ 24న ముదిగొండకు చెందిన షేక్ లాల్‌సాహెబ్ కుమారుడు మన్సూర్ అలీ బట్టలు కొనడానికి మోటార్ సైకిల్‌పై స్నేహితులతో కలిసి ఖమ్మం వెళ్లి వస్తుండగా వెంకటగిరి క్రాస్ సమీపాన ట్రాక్టర్ డ్రైవర్ వెంకటేశ్వర్లు అజాగ్రత్తగా నడుపుతూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో మన్సూర్ అలీకి తీవ్రగాయాలతో మృతి చెందగా మిగతా ఇద్దరికి గాయాలయ్యాయి. ఈమేరకు లాల్‌సాహెబ్ ఫిర్యాదుతో కసు నమోదు చేసిన ముదిగొండ పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం వెంకటేశ్వర్లుపై నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు.

కండక్టర్ బ్యాగ్‌లో నగదు చోరీ

సత్తుపల్లిటౌన్: బస్సు ఎక్కుతున్న సమయాన మహిళా కండక్టర్ క్యాష్ బ్యాగ్‌లోని నగదును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. సత్తుపల్లి బస్టాండ్ నుంచి బుధవారం ఖమ్మం వెళ్లిన ఓ బస్సుకు కండక్టర్‌గా ఎం.డీ.షబానాబేగం విధులు నిర్వర్తించారు. ఆమె నగదుతో ఉన్న క్యాష్‌బ్యాగ్‌తో బస్సు ఎక్కుతుండగా అందులో నుంచి రూ.2,840 అపహరించారు. బస్సు ఎక్కాక ఈ విషయాన్ని గుర్తించిన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటోలో నుంచి మిర్చి బస్తాలు...

తిరుమలాయపాలెం: మార్కెట్‌కు తరలించేందుకు ఆటోలో వేసిన మిర్చి బస్తాలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటనపై బుధవారం కేసు నమోదైంది. మండలంలోని జూపెడకు చెందిన దోనేపల్లి వెంకన్న, బచ్చోడుతండాకు చెందిన బాసు ఖమ్మం మార్కెట్‌కు మిర్చి తీసుకెళ్లేందుకు మంగళవారం రాత్రి ఆటోలో లోడ్ చేశారు. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి ఎనిమిది బస్తాలు తక్కువగా ఉన్నాయి. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించిన వారి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.